# 5. శివంగి

కొండ కోనల్ని దాటుకుని హైవే పక్కనున్న ఊరివైపు వచ్చింది బస్సు.

"రావారం రావారం" - కేక పెట్టేడు కండక్టరు. వీధి చివర రోడ్డు మీద ఆగిన బస్సులోంచి దిగింది శివంగి.

రాత్రి నుంచి సన్నగా జల్లు కురుస్తూనే ఉంది. వీధంతా రొచ్చు రొచ్చుగా, బురద బురదగా ఉంది.

బట్టల సంచినీ, గోనె మూటనీ రెండు చేతుల్లో పట్టుకుని రోడ్డు స్లోపు దిగి నడుస్తోంది. ఆమె మనసు నిప్పుల్లో కాలుతున్నట్టుంది. దారి పక్క బురదలో పడుకున్న గేదెలు వొంటిమీద వాలుతున్న జోరీగల్ని తోకల్తో తోలుకుంటున్నాయి. టపటపా చెవుల్తో కొట్టుకుంటున్నాయి.

శివంగి చీరకుచ్చిళ్లు బురదలో తడిసి తపతప మంటున్నాయి. ఇంటికి చేరుకునేసరికి వొళ్లంతా గేదెల రొచ్చుతో స్నానమాడినట్టయింది.

సంచులు అరుగుమీద పెట్టి, వాకిట్లోని కుండలోంచి చెంబెడు నీళ్లు ముంచుకుని అలవాటుగా పాదాల మీద పోసుకుంది. ఆమె లోపల రగులుతున్న వేడి వాన చినుకుల్ని జయించి చెమట ధారలుగా ప్రవహిస్తోంది. అభావంగా సంచిలోంచి తువాలు గుడ్డతీసి తల, మొహం తుడుచుకుంది.

వాకిట్లో అలికిన పొయ్యి తడిసిపోయి ఇటుక రాళ్లు బైటికి కన్పడుతున్నాయి.

మొలసంచిలోంచి తాళం చెవి తియ్యబోయి ఆగిపోయింది. తలుపు దగ్గరకి చేరేసి ఉంది.

"పొద్దెక్కి పదిగంటల ఏళ ఈ మనిసి ఇంట్లోనే ఉన్నాడంటే పనికి ఎగనామం పెట్టేసేడన్నమాట" అనుకుంటూ వెళ్లి విసురుగా తలుపు తోసింది.

బాగా బలిసిన ఎలక ఒకటి ఆమె ముందునుంచి తుర్రున పరుగెత్తి సామాన్ల వెనక ఎక్కడో నక్కింది.

శివంగి ఆశ్చర్యంగా చూసింది. ఇరవై రోజుల క్రితం తను ఊరెల్లబోతూ తలుపు తాళం పెట్టబోతూంటే చిన్న ఎలక పిల్ల బైటినించి పరుగెత్తుకొచ్చి ఇంట్లో దూరింది. ఎలక రోజుకి ఎంత తిండి తింటాదో తనికి ఎరుకే అయినా, ప్రయాణం తొందర్లో దాన్ని బైటికి తరమలేక అలాగే ఎల్లిపోయింది.

'ఎంతలో ఎంతగా ఎదిగిపోయింది!'

కళ్లు చీకటికి అలవాటు పడ్డాక చూస్తే ఓ మూల ఒంటిమీద గుడ్డల స్పృహ కూడా లేకుండా పడి దొర్లుతున్న శీను కన్పించేడు. పక్కనే తాగి పడేసిన సారా పేకెట్లు, ఎలక కాబోలు పీకి పడేసిన పకోడీల పొట్లం, అక్కడక్కడ నలిగి పడివున్న మల్లెపూలు కూడా కనిపించాయి.

అలవాటైన దృశ్యమే అయినా శివంగి కళ్లల్లోకి ఈ సారి కన్నీళ్లు పొంగి రాలేదు.

ఒక నిస్సత్తువ ఏదో ఆవరించినట్టయి గడపకి చేరబడి కూర్చుండిపోయింది.

పిల్లల్ని తీసుకొని పుట్టింటి కెళ్లిన శివంగి వచ్చేముందు అన్నగారన్న మాటలకి సగం చచ్చిపోయినట్టయింది.

"పిల్లల్ని వొదిలేసి ఎల్లే, నాలుగు రోజుల్తర్వాత బళ్లు తీసే ఏలకి మీయయ్య ఎక్కడన్నా పుట్టించుకొత్తాళ్ళే డబ్బులు" అంది తల్లి.

వెంటనే "ఏటమ్మా శివంగి తల్లే, పెల్లి సేసి అంపించినా మాకీ పీడొదల్దేటి? పిల్లల సదువుల కాణ్నుంచి ఏటికేడాదీ మేవే పెట్టుబళ్ళెట్టాలంటే మాకాడేటి మూటలు మూలుగుతున్నాయేటి? ఇంటందరం రెక్కలు ముక్కలు సేసుకుని పోడుసెక్కలు సేస్తన్నామేమో, నాలుగేళ్లూ నోట్లో కెల్తన్నాయేమో! నీ మొగుడేటి రాజాగోరేటి ఎప్పుడూ తొంగుని తింటాన్కి? పెళ్లాం పిల్లల్ని పోసించుకోలేనోడు ఆడేం మొగోడెహె. ఛూ.... ఆడమ్మాబతుకు.... తియ్. ఆడంపించటం, సిగ్గులేకుండా ఈవిడగారొచ్చి మా పేనాలు తోడుకు తింటం" అన్నాడు అన్నగారు.

అప్పటికే శివంగి కళ్లల్లోంచి నీళ్లు జలజలా రాలడం చూసి "ఓరూరుకోరా పెద్దోడా, ఆడపిల్లనేటి ఏడిపించి పంపిత్తావేటి? దాని తలరాతలాగున్నాది. కుర్రోడు ఎర్రగా బుర్రగా ఉన్నాడు, ఈడూ జోడూ బాగుంటాదని మనవే కాదేటి పెల్లి సేసినోల్లం. ఆడింత కాన్నాకొడుకౌతాడని కలగన్నావేటి!" అన్నాడు తండ్రి.

తను పౌరుసంగా పిల్లల్ని తీసుకొని వచ్చెయ్యబోతూంటే గెడ్డం పట్టుకొని బతిమలాడింది తల్లి. పౌరుసానికి పోతే నస్టపోయేది తన పిల్లలేనని తెలుసు. అందుకే వదిలేసి వచ్చింది.

బస్సులో కూచుని ఎన్ని ఆలోసన్లు చేసుకుంది! ముందు పేణాలు తీసుకోవాలనుకుంది. పిల్లలు గుర్తుకొచ్చి 'ఛా....' అనుకుంది. ఎలాగైనా నచ్చజెప్పుకోవాలని ఎన్నెన్ని అనుకుంది!

ఇంట్లో ఎప్పుడూ ఇబ్బందే. నెలకి ఏ నాలుగైదు రోజులో తప్ప పనికెల్లడు. అలాగని తననీ ఎల్లనివ్వడు.

అనుకోకుండా చూపులు అతని మీదికి మళ్లి అసహ్యంతో వొళ్లు జలదరించింది శివంగికి.

'ఈ సారి ఎవరో ఆడదాన్ని తెచ్చుకున్నాడు. అసలే రోజులు బాగోలేవు. అయివే పొడుక్కీ ముట్టుకుంటే అంటుకునీలాగ ఎయిడ్సు జబ్బు పాకిపోయిందని సెప్పుకొంటన్నారు.

ఆ సమయంలో అతనెలాగ నడ్సుకుంటాడో తనకి బాగా ఎరికే. పిల్లలిద్దరికీ మధ్యలో కుసింత ఎడం కోసం తొడుగువాడమన్నా వొప్పుకోనోడు ఏం జబ్బు తెచ్చుకున్నాడో ఏమో. ఇంతకి దిగజారేడు.

'ఏం సెయ్యాల?' పెదవి కొరుక్కుంటూ ఉండిపోయింది శివంగి. వొళ్లు కుతకుతా ఉడుకుతా ఉంది.

ఎలక అటక పైకెక్కినట్టుంది, గుండుచెంబుని కిందికి తోసేసింది. అప్రయత్నంగా పైకి చూసిన శివంగికి అటకమీది ఇత్తడి సామాన్లలో రెండు బిందెలు కన్పించలేదు.

"ఏటి సూస్తన్నావ్, దబ్బుల్లేక నేనే తాకట్టెట్టేను. మీ బాబు నడిగిడబ్బులేవన్నా తెచ్చేవా లేదా, సేతిలో డబ్బుల్లేవసలే". చటుక్కున పక్కకి చూసింది శివంగి.

"ఎంత సేపైందొచ్చి? అన్నం వొండేవా, సేలా ఆకలేస్తంది" స్థిమితంగా లేస్తూ అంటున్నాడు శీను. ఎకా ఎకి అతని మీదికి దూకి పీక పిసికి చంపెయ్యాలన్పించింది.

తమ కులంలో ఇత్తడి సామాను లేకుండా పెళ్లిళ్లు జరగవు. తనకీ ఒక ఆడపిల్ల ఉంది. అందుకే తల్లి తన కిచ్చిన ఇత్తడి సామాన్ని తళ తళలాడేలా తోమి జాగర్తగా కాపాడుకొస్తంది.

"ఇతగాడిలా మొదలు పెట్టేడు. ఇంకేమైనా మిగులుత్తాడా? ఒకటీ ఒకటీ కాళ్లొచ్చి నడిసిపోతై గావోలు" అనుకుంది దిగులుగా.

పెణకలోంచి పందుంపుల్ల తీసుకొని వెళ్తూ "ముందు కాపీ పెట్టు. మా హీరో పుట్టిన్రోజియ్యాల. బస్తీకెల్లాల" అంటూ బైటికి పోయేడు శీను. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో ఏడుపొస్తాఉంది.

"ఏడవ్వొద్దు... ఏడవ్వొద్దు..." తనకి తనే నచ్చచెప్పుకొంటా ఉంది.

కసి, ఏదో ఒకటి చెయ్యాలనే కసి.

రాత్రి పుట్టింట్లో తిన్న అడవిపంది మాంసం గుర్తుకొచ్చింది. ఆ పందిని తమ గూడెపోల్లు ఎలాగ ఏటాడతారో గుర్తుకొచ్చింది.

బరిసెల్తో పొడిసి పొడిసి...

సిన్నప్పుడొకసారి అయ్యని అడిగింది. "ఎందుకయ్యా, పందుల్ని ఏటాడి సంపుతారు?" అని.

"మనం పండించే దుంపాదుడుగూ తొవ్వేసి నాశినెం సేసేత్తాయి. మనకి కలిసి రాని ఏ పేణినీ బతకనియ్యకూడదు" అన్నాడు. 'కలిసి రాని ఏ పేణినీ...'

సన్నికల్లు మీద నూరిన ఎండుమిరపకారం ముద్ద... కట్టెలపోయ్యి మీద ఉడుకుతున్న ఎర్రని మాంసం కూర... తినగానే ఒంట్లో రక్తాన్ని ప్రేణబయంతో పంది పరుగెట్టినట్లు పరుగెట్టించే కూర...

శివంగి ఒంట్లో రక్తం సలసలా మరుగుతూ పరుగెడుతోంది. ఎలక అటక మీంచి కిందికి దూకి సరుకుల గూట్లోకి దూరింది. శివంగి తలుపు దగ్గరకి మూసి, మూలనున్న కర్ర తీసుకుని గూటి మీద ఒక్కటి బాదింది. ఎలక కిందికి దూకి ఆమె పాదాల మీదుగా పరుగెత్తి అవతలి మూల నక్కింది. శివంగి సరుకుల గూట్లో డబ్బాలు తీసి చూసింది. అన్నిటి మూతలూ తీసేసి ఉన్నాయి. ఎలక మొత్తం అన్నీ ఖాళీ చేసేసింది. బియ్యం కుండ అడుగున గుప్పెడు బియ్యం మిగిలాయి. అవీ ఎలక పెంటికల్తో నిండిపోయి ఉన్నాయి. చటుక్కున శివంగి కన్ను గూట్లో మూలనున్న పేకెట్టు మీద పడింది. దాని పైన బాణం గుచ్చుకుని విలవిలలాడుతున్న ఎలక బొమ్మ....

అదేంటో శివంగికి గుర్తుకొచ్చింది. ఆ మధ్య వారపు సంతలో సరుకుల్తోబాటు కొనుక్కొచ్చింది. దాని మాటే మరచిపోయింది. ఇప్పుడు ఆ పేకెట్టు చేతిలోకి తీసుకోగానే శివంగి రక్తం ఆవేశంతో ఉరకలేసింది.

శీను వచ్చినట్టున్నాడు. "ఏటే, ఇంకా పొయ్యంటించలేదు? కాపీ పెట్టమని సెప్పేనా.... నీ!" బూతులు తిడుతున్నాడు.

"పాలు లేవు" అరిచింది, "పాలెవడడిగేడు, నల్లకాపీ పెట్టు".

గుమ్మంలో ఉన్న ఆరిన చితుకులు గుప్పెడు పట్టుకెళ్లిపొయ్యిలో వేసి, వాటిమీద కిరసనాయిలు ఒంపి, అగ్గిపుల్ల గీసి పడేసింది. పొయ్యి భగ్గున అంటుకుంది.

విసవిసా నడుస్తూ లోపలి కొచ్చి చట్టిలో గ్లాసెడు నీళ్లుపోసి, డబ్బాల అడుగున మిగిలిన పంచదార, కాఫీ పొడి ఊడ్చి వేసేసింది.

ఎలక మళ్లీ ఆమె కాళ్ల సందునుంచి పరుగెత్తింది. శివంగి కసిగా ఎలకల మందు పేకెట్టు చింపి చట్టిలో పోసేసింది. పట్టుకెళ్లి పొయ్యి మీద పెట్టింది. పుల్లలు ఎగదోసింది.

కాఫీ మరుగు పట్టింది.

శీను అరుగు చివర కాళ్లు వేలాడేసుక్కూచుని కాఫీ కోసం చూస్తున్నాడు.

శివంగి లోపలికెళ్లి కాఫీ వడకట్టే ప్లాస్టిక్ ఫిల్టరు కోసం వెతుకుతోంది. ఎలక దాన్ని ఓ పక్క కొరికేసింది.

శివంగి పళ్లు పటపటా కొరికింది.

గ్లాసు తెచ్చి, ఫిల్టరు పక్కకి వంచి కాఫీ వడకట్టింది. లోపల ఎలక ఏదో పడదోసింది మళ్లీ. శివంగి గ్లాసు శీను చేతికందించింది.

ఒక్క గెంతులో అరుగుపైకెక్కి గదిలోకెళ్లింది. మూలనున్న కర్ర చేతిలోకి తీసుకుంది. సరిగ్గా అప్పుడే ఎలక గదిలో అవతలివైపు పరుగెత్తబోయింది. వొడిసి చూసి ఒక్కటేసింది శివంగి. కొండ ఎలకల్ని వేటాడే అలవాటు ఊరికే పోలేదు. ఎలక ప్రాణం వదిలేస్తూ విల విలా కొట్టుకుంది. శివంగి వేపు అదోలా చూసింది.

ఆ చూపు శివంగి గుండెలో నాటుకుంది.

శివంగి కరిగి నీరవుతూ వెనక్కి తిరిగి చూసింది. శీను కాఫీను ఊదుకుని ఊదుకుని తాగబోతున్నాడు.

పూనకం వచ్చినట్టు గురి చూసి కర్రని అతని మీదికి విసిరేసింది. కర్ర అతని చేతికి తగిలి, కాఫీ గ్లాసు ఎగిరి వాకిట్లో పడింది.

"ఏటే నీయయ్య...." తిట్లకి లంకించుకున్నాడు శీను. శివంగి శివంగిలా దూకి శీను మెడని వాటేసుకుని భోరుమంది.

*(20-6-2008, ఆదివారం ఆంధ్రజ్యోతి)*